సందర్శకులను అనుమతించవద్దు

ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి



తాడేపల్లి రూరల్: సీతానగరం పుష్కర ఘాట్ వద్ద వరద ఉద్ధృతిని ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి సోమవారం పరిశీలించారు. అక్కడ విధుల్లో ఉన్న పోలీసు అధికారుల్ని అప్రమత్తం చేశారు. పుష్కర ఘాట్, ప్రకాశం బ్యారేజీ వద్దకు సందర్శకులను అనుమతించవద్దని ఆదేశించారు. కృష్ణానది ఉద్ధృతంగా ప్రవహిస్తున్న దృష్ట్యా ప్రమాదాలు జరగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆయన వెంట మంగళగిరి డీఎస్పీ రాంబాబు, సీఐ కళ్యాణ్‌రాజు తదితరులు ఉన్నారు.

మంగళవారం । 3 । సెప్టెంబర్ । 2024

భయం గుప్పెట బతుకు

కొనసాగుతున్న కృష్ణమ్మ వరద ఉద్ధృతి

- కృష్ణానదికి, కొండవీటి వాగుకు పోటెత్తిన వరద
- జలదిగ్బంధంలో మహానాడు, ఉండవల్లి
- పొంగిపొర్లుతున్న గుంటూరు చానల్
- బకింగ్‌హామ్ ఎక్స్‌క్లూయిస్ వద్ద ఓవర్‌ఫ్లో
- నీట మునిగిన వేల ఎకరాల పంట
- ముందస్తు హెచ్చరికలు లేవంటున్న ప్రజలు
- వరద హెచ్చరికల నేపథ్యంలో ప్రకాశం బ్యారేజ్‌పై రాకపోకలు నిలిపివేత

తాడేపల్లి రూరల్: కృష్ణానది ప్రకాశం బ్యారేజ్ వద్దకు భారీగా వరదనీరు వచ్చి చేరడంతో ఎంటీఎంసీలోని పలు ప్రాంతాలు సోమవారం నీట మునిగాయి. మహానాడు ప్రాంతంలో భారీగా వరద వస్తుందని ముందస్తుగా ఇరిగేషన్ అధికారులు సమాచారం ఇవ్వకపోవడంతో భారీ నష్టం ఏర్పడింది. ఆదివారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో వరదనీరు పెరిగింది.

మహానాడు రైల్వే బ్రిడ్జి వద్ద నుంచి కనకదుర్గ వారధి వరకు ఉన్న 28 రోడ్లలో ఇళ్లల్లోకి నీరు చొచ్చుకు వెళ్లింది. గాఢనిద్రలో వున్న ప్రజలు వరదనీటిని చూసి భయభ్రాంతులకు గురయ్యారు. మహానాడులో రెండు అంతస్తులు ఉన్న ఇళ్లలోకి వెళ్లి తలదాచుకున్నారు. తెల్లవారుజాము నుంచి తాడేపల్లి, మంగళగిరి సీఐలు కళ్యాణ్‌రాజు, వినోద్‌కుమార్ సిబ్బందితో నివాసాల్లో ఉన్న వారిని కరకట్టమీదకు తీసుకు వచ్చారు. ప్రభుత్వం పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడంలో విఫలం చెందడంతో కరకట్ట మీద తలదాచుకున్నారు. సుమారు 1500 నుంచి 2 వేల కుటుంబాలు రోడ్డుపైనే పడిగాపులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.



మునిగిపోయిన బకింగ్ హామ్ కెనాల్ పాత బ్రిడ్జి

కృష్ణమ్మ ఉగ్ర రూపం

ప్రకాశం బ్యారేజ్ ఎగువ ప్రాంతం వద్ద వరద నీరు ఉగ్ర రూపం దాల్చింది. బకింగ్‌హామ్ కెనాల్ వద్ద పాత, కొత్త బ్రిడ్జిల వద్ద ఓవర్‌ఫ్లో అయింది. కృష్ణానది పడవలు వెళ్లే మార్గంలో నుంచి బకింగ్ హామ్ కెనాల్‌కు వరదనీరు వచ్చి చేరింది. కొండవీటి వాగు ఎక్స్‌క్లూయిస్ వద్ద రెండు గేట్లుకొట్టుకు పోయాయి. వరదనీరు గుంటూరు చానల్‌కు చొచ్చుకు వచ్చింది. గుంటూరు చానల్ ఉద్ధృతంగా ప్రవహిస్తున్న పోలకంపాడు, బాయనయ్య నగర్, ఉండవల్లి దళత వాడ వైపునకు వరద నీరు చేరింది. పై నుండి కొండవీటి వాగుకు వరద రావడం, ఒకవైపు కృష్ణానది నుంచి కొండవీటి వాగు, గుంటూరు చానల్‌కు వరదనీరు చేరడంతో ఉండవల్లి గుహల వద్ద, అమరావతి ఉండవల్లి సెంటర్ రోడ్డులో భారీగా నీరు వచ్చి చేరింది. కొండవీటి వాగు బ్రిడ్జి మీద నుంచి ముఖ్యమంత్రిచంద్రబాబు నాయుడు నివాసానికి వెళ్లే మార్గంలో రహదారిపై వరదనీరు వచ్చి చేరింది. తెనాలి గుంటూరు నగర పాలక సంస్థకు తాగునీరు అందించే ఎక్స్‌క్లూయిస్ పూర్తిగా వరదనీటిలో చిక్కుకున్నాయి. మంగళగిరికి తాగునీరు సరఫరా చేసే మోటార్లు పూర్తిగా నిలిపివేశారు. ఉండవల్లి పెనుమాక పంట పొలాల్లో భారీగా కొండవీటి వాగు వరద వచ్చి చేరింది. సారపాక వాగు పైపులైన్లు కృష్ణానదిలోకి ఉండడంతో అక్కడ లాకులు కొట్టుకు పోయి, కృష్ణాయపాలెం మీదుగా వరదనీరు పెనుమాకలోకి వచ్చి చేరుతోంది. కృష్ణానది దిగువ ప్రాంతంలో కనకదుర్గ వారధి వెంబడి పంట పొలాలు పూర్తిగానీటిలో మునిగాయి. కృష్ణానది కరకట్ట లోపల వున్న సుమారు 72 అక్రమ కట్టడాలు పూర్తిగా నీటిలో మునిగాయి.



మహానాడును వరద ముంచెత్తడంతో చంటిబిడ్డతో కరకట్ట మీద నిలుచున్న మహిళ



వెంకటపాలెం అవుట్ ఫాల్ స్లూయిజ్ వద్ద లీకేజీని పూడ్చిన అధికారులు



తాడికొండ-కంతేరు మధ్య ఎర్రవాగు ఉప్పొంగడంతో కొట్టుకుపోయిన ప్రధాన రహదారి

న్యూస్‌రీల్

నేడూ పాఠశాలలు, కళాశాలలకు సెలవు

గుంటూరు ఎడ్యుకేషన్: భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు మంగళవారం కూడా సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ, ఆర్ఐవో జీకే జుబేర్ సోమవారం చెప్పారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకునికలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలలు విద్యార్థులకు విధిగా సెలవు ప్రకటించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాలపై ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

34,262.4 హెక్టార్లలో పంటలకు నష్టం



కొరిటిపాడు(గుంటూరు): భారీ వర్షాలకు జిల్లా వ్యాప్తంగా 34,262.4 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన సోమవారం 'సాక్షి'తో మాట్లాడారు. 30,272.4 హెక్టార్లలో వరి, 2,735.2 హెక్టార్లలో పత్తి, 426.8 హెక్టార్లలో మినుము, 107.6 హెక్టార్లలో సోయాబీన్, 12 హెక్టార్లలో పెసర, 8.4 హెక్టార్లలో జనుము నీట మునిగినట్లు పేర్కొన్నారు. వాతావరణం అనుకూలించిన తర్వాత నష్టాన్ని మదింపు చేసి, నివేదికను ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు.

రైల్వే అధికారుల నిర్లక్ష్యం.. నిండు ప్రాణం బలి



పెదకాకాని : రైల్వే అధికారులు నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలైన సంఘటన సోమవారం వెలుగు చూసింది. పెదకాకాని మండలం, కొప్పురావూరు గ్రామ శివారులోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద అధిక పరిమాణంలో చేరిన నీటిలో నడుస్తూ ఓ వ్యక్తి నీట మునిగి మృతి చెందాడు. కొప్పురావూరు గ్రామానికి చెందిన తోట శ్రీనివాసరావు(60)హైవే పై ఉన్న హోటల్లో పని చేస్తుంటాడు. రెండు రోజుల కిందట రాత్రి డ్యూటీ ముగించుకుని తిరిగి ఇంటికి వెళుతున్నాడు. ఈ సమయంలో ప్రమాదవశాస్తూ కొప్పురావూరు రైల్వే అండర్ బ్రిడ్జి కింద ఉన్న నీటిలో పడి చనిపోయాడు. సోమవారం ఉదయం మృతదేహం నీటిపై తేలడంతో గుర్తించిన గ్రామస్తులు బయటకు తీసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైల్వే అధికారులకు గ్రామస్తులు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో అండర్ బ్రిడ్జిలో పూర్తిగా నీరు చేరింది. శ్రీనివాసరావు మృతికి రైల్వే శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమని గ్రామస్తుల ఆరోపించారు.

పునరావాస కేంద్రాలకు బాధితుల తరలింపు



మహానాడు కాలనీలో అధికారులు, స్థానికులతో కలెక్టర్ నాగలక్ష్మి

తెనాలి: జిల్లాలో కృష్ణానదికి భారీగా వరదనీరు వస్తున్నందున నదికి సమీపంలో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాల్లోని పునరావాస కేంద్రాలకు తరలించడంతో పాటు వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యల్ని నిరంతరం అప్రమత్తతతో చేపడుతున్నట్టు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి వెల్లడించారు. తాడేపల్లి మండలంలో ప్రకాశం బ్యారేజీ సమీపంలో కృష్ణానది వరదనీటి ముంపుకు గురైన మహానాడు కాలనీని సోమవారం ఆమె తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహాతో కలిసి పరిశీలించారు. ముంపునకు గురైన కుటుంబాలకు అందిస్తున్న సహాయ కార్యక్రమాలు, పునరావాస కేంద్రాల గురించి ప్రత్యేక అధికారి, జిల్లా అటవీశాఖ అధికారి మహబూబ్ బాష జిల్లా కలెక్టర్‌కు వివరించారు. కాలనీలో వరదనీరు చేరిన ఇళ్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కృష్ణానదికి వరద నీరు పెరిగే అవకాశం ఉన్నందున కాలనీలో లోతట్టు ప్రాంతాలవారు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. వరదనీటి ముంపు తగ్గేవరకు నివాసితులకు జిల్లా యంత్రాంగం తరపున అన్ని సహాయసహకారాలు అందిస్తామని భరోసా కల్పించారు. నదికి అతి సమీపంలోని ఇళ్లలో ఉన్నవారిని అందరినీ వెలుతురు ఉన్నప్పుడే పునరావాస కేంద్రాలకు తరలించాలని ఎంటీఎంసీ అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. మహానాడు కాలనీలోని 29 లైన్లకు ప్రతి లైనుకు నలుగురు చొప్పున సచివాలయ ఉద్యోగులను ప్రత్యేకంగా నియమించాలని ఆదేశించారు. కాలనీలో విద్యుత్ సరఫరా నిలిపివేసినందున, రాత్రిపూట ప్రత్యామ్నాయ మార్గాలకు చర్యలు తీసుకోవాలని అధికారుల్ని ఆదేశించారు.

యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు

గుంటూరు వెస్ట్ : భారీ వర్షాలకు ముంపు బారిన పడిన ప్రజలకు అండగా ఉంటామని కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాధితుల్ని ఆదుకునేందుకు ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కృష్ణా నదికి శనివారం ఉదయం 4 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు 10.5 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చిందని చెప్పారు. నదికి ఆనుకుని ఉన్న గ్రామాలు, కాలనీల్లోకి నీరు రావడంతో అక్కడున్న వారిని సహాయక శిబిరాలకు తరలించినట్లు తెలిపారు. తాడికొండ నియోజకవర్గంలోని మహానాడు ప్రాంతంలోనూ 2 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని వెల్లడించారు. తాడేపల్లిలో మొత్తం నాలుగు శిబిరాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. దుగ్గిరాల, పెదకొండూరు ప్రాంతాల్లోని ప్రజల్ని శిబిరాలను తరలించామని చెప్పారు. తుళ్లూరులోని ఉద్దండరాయునిపాలెం లంక ప్రజల్ని ఆదివారం రాత్రి శిబిరానికి తరలించామని తెలిపారు. కొన్ని లంక ప్రాంతాలకు ప్రైవేటు బోట్లను ఏర్పాటు చేశామని చెప్పారు.

లంక గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉండాలి: ఎస్పీ



పిడపర్తిపాలెంలో వరద ప్రభావం గురించి ప్రజలను అడిగి తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

కొల్లిపర: కృష్ణా నదిలో వరద ఉద్ధృతి కొనసాగుతున్నందున పోలీసులు, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు లంక గ్రామాల్లో ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండాలని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశించారు. వరద బాధితుల్ని హనుమాన్‌పాలెం, తూములూరు హెస్కూళ్లలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించాలని చెప్పారు. ఆయన సోమవారం కొల్లిపర మండలంలోని అత్తలూరిపాలెం, వల్లభాపురం, పిడపర్తిపాలెం, పాతబొమ్మువానిపాలెం వద్ద కృష్ణానది కరకట్టను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కరకట్ట బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో అధికారులు తీసుకుంటున్న చర్యల గురించి తెలుసుకున్నారు. అధైర్య పడొద్దని, పోలీసులు అండగా ఉంటారని తెలిపారు. వరద సమయంలో విపత్కర పరిస్థితుల్ని సమర్థంగా ఎర్కొనేందుకు ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందితో సిద్ధంగా ఉన్నామని చెప్పారు. వరద ప్రభావం ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులకు సూచించారు.బాధితులకు వసతి, ఆహారం, మంచినీరు అందించడంలో సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో తెనాలి రూరల్ సీఐ బెల్లం శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కరకట్టలను పటిష్టం చేయాలి



కరకట్ట బలహీనంగా ఉన్న చోట ఇసుక బస్తాలను పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

కొల్లిపర : బలహీనంగా ఉన్న కరకట్టలను పటిష్టం చేయాలని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారుల్ని ఆదేశించారు. ఆయన సోమవారం కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ వి.సంజన సింహతో కలసి కొల్లిపర మండలం అత్తలూరిపాలెం, వల్లభాపురం, పిడపర్రు, పాత బొమ్మువానిపాలెం గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఆయా గ్రామాల్లో కృష్ణానది కరకట్టను పరిశీలించారు. పూర్తిగా నీట మునిగిన పంటలను పరిశీలించారు. అత్తలూరిపాలెం, పిడపర్రు వద్ద కరకట్ట బలహీనంగా ఉండటంతో ఆ ప్రదేశంలో వెంటనే మట్టి, గ్రావెల్ ద్వారా కట్టను పటిష్టం చేయాలని అధికారుల్ని ఆదేశించారు. పిడపర్రు వద్ద మంత్రి మనోహర్ స్వయంగా పారతో ఇసుకను తీసి సంచులలో నింపేందుకు తోడ్పడ్డారు. కరకట్ట వద్ద లీకేజీలను పూడ్చారు. వరద ఉద్ధృతి పెరిగే అవకాశం ఉన్నందున లంక గ్రామాల ప్రజలు , రైతులు రెండు రోజులు జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. పంటలు దెబ్బతిన్న రైతుల్ని ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుందని హామీనిచ్చారు.




బాలింతను బయటకు తరలిస్తున్న మంగళగిరి సీఐ వినోద్ కుమార్



వెంకటపాలెం మంతెన సత్యన్నారాయణ రాజు ఆశ్రమంలో వరద నీరు చుట్టుముట్టడంతో తాళ్ల సాయంతో బయటకు వస్తున్న రోగులు

ప్రకాశం బ్యారేజ్‌కు పెనుముప్పు



రెండు రైల్వే బ్రిడ్జిల వద్ద నీట మునిగిన స్తంభాలు

తాడేపల్లి రూరల్ : కృష్ణానది ఎగువ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా భారీ ఇసుక పడవలను నిలిపారు. అవి వరద నీటిలో కొట్టుకు వచ్చి ప్రకాశం బ్యారేజ్ వద్ద గేట్లకు తగలడంతో రెండు దెబ్బతిన్నాయి. ఒక గేటుకు పడవ అడ్డం పడింది. ఆ గేటు వద్ద షట్టర్లను కిందకు పైకి ఎత్తే కాంక్రీట్ దిమ్మ దెబ్బతింది. సీతానగరం అండర్‌పాస్ గేట్లకు సంబంధించి చైన్లు తెగిపోయాయి. పుష్కర ఘాట్‌లకు వెళ్లే మార్గంలో రిటైనింగ్ వాల్ కూలి ప్రమాద భరితంగా మారింది. బకింగ్ హాం ఎక్స్‌క్లూయిస్ వద్ద పాత, కొత్త బ్రిడ్జిల మధ్య వరదనీరు ప్రవహిస్తోంది. బ్రిడ్జి మీద నుంచి నీరు ఓవర్ ఫ్లో అవుతోంది. దీంతో బ్యారేజ్‌పై రాకపోకలను నిలిపివేశారు.



రాయపూడి పెదలంకలో చిక్కుకున్న వారిని రక్షిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

మహానేతా... నీ ఘనతను మరువలేం !

- వాడవాడలా వైఎస్సార్ వర్ధంతి
- పలుచోట్ల అన్నదానాలు, సేవా కార్యక్రమాలు
- భారీగా హాజరైన వైఎస్సార్ సీపీ శ్రేణులు



జిల్లా పార్టీ కార్యాలయంలో నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి విడదల రజని,జిల్లా అధ్యక్షులు మందపాటి శేషగిరిరావు, మాజీ ఎంపీ మోదుగుల, డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు

పట్నంబజారు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, మాజీ మంత్రి విడదల రజిని, పార్టీ నేత మోదుగుల వేణుగోపాలరెడ్డి, ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్, నగర డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, జీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ లాల్‌పురం రాము, పార్టీ నేత మేకతోటి దయాసాగర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ సూర్యచంద్రలు ఉన్నంతకాలం పేదల హృదయాల్లో మహానేత డాక్టర్ వైఎస్సార్ ఉంటారని పేర్కొన్నారు. మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ వై.ఎస్.జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకునేంత వరకు పోరాటం చేస్తామని, కష్టాలకు కూడా వెరవకుండా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, భగవాన్, మండేపూడి పురుషోత్తం, బత్తుల దేవానంద్, భవాని, ముంతాజ్ పఠాన్, అంగడి శ్రీనివాసరావు, మస్తాన్‌వలి, కొత్తా చినపరెడ్డి, మెట్టు వెంకటప్పారెడ్డి, బైరెడ్డి రవీంద్రారెడ్డి, ఓం ప్రకాష్‌రెడ్డి, మురళి, గోపీ శ్రీనివాస్, ఆచారి, గురవయ్య, సంతోష్, వంశీ, అంబేడ్కర్, మార్కెట్‌బాబు, బి.సుబ్బయ్య, షేక్ బాజీ సాహెబ్, నాయుడు నాగేశ్వరరావు, వెంకటసురేంద్ర, ముత్యాలరాజు, షేక్ నాజర్, పిల్లి మేరి, విజయభరత్, బెంజిమన్ పాల్గొన్నారు.

బస్టాండ్‌లో భారీగా నీరు



పట్నంబజారు : వర్షాలతో గుంటూరు రీజియన్ పరిధిలో ఆర్టీసీకి తీవ్ర నష్టం వాటిల్లింది. మూడు రోజుల పరిధిలో కోటి రూపాయలకు పైగా నష్టం వాటిల్లినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షాలు కారణంగా ఆర్టీసీ బస్టాండ్‌లో భారీగా నీరు నిలిచింది. బస్సులు పూర్తిస్థాయిలో తిరగలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. మరో రెండు మూడు రోజులు పాటు ఇదే పరిస్థితి నెలకొని ఉండే అవకాశం ఉందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ప్రయాణికుల రద్దీ కూడా పూర్తిగా తగ్గడంతో ఆదాయం తగ్గిందని తెలిపారు.